సాక్షి ఆదిలాబాద్

బుధవారం : 20 : మార్చి : 2024

'పది' పరీక్షలకు 48 మంది గైర్హాజరు

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం నిర్వహించిన ద్వితీయ భాష పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 10,407 మందికి గాను 48 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి మాస్ కాపీయింగ్ కేసులు నమోదు కాలేదని డీఈవో ప్రణీత తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ : 6:28	గురు : 4:57

గరిష్టం/కనిష్టం
33.0/21.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. మధ్యాహ్నం ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ఏప్రిల్ 25 నుంచి 'ఓపెన్' పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ఏప్రిల్ 25 నుంచి మే 2వ తేది వరకు నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు మే 3 నుంచి 10వ రకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విషయాన్ని ఓపెన్ స్కూల్ విద్యార్థులు గమనించాలని సూచించారు.

మీడియా సెంటర్ ప్రారంభం



మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సమాచార శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా మంగళవారం ప్రారంభించారు. ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి కేంద్రాన్ని ప్రారంభించి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు డీపీఆర్వో ద్వారా అందించడం జరుగుతుందన్నారు. ఎంసీఎంసీ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, పత్రికల్లో ప్రచురించిన రాజకీయ ప్రకటనలను అభ్యర్థి ఎన్నికల వ్యయంలో నమోదు చేయనున్నట్లు తెలిపారు. శాటిలైట్ చానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, సోషల్ మీడియా, ఈ పేపర్‌లో ప్రకటనలు, బల్క్ ఎస్ఎంఎస్, వాయిస్ మెసేజ్‌లు, ఇతర ఆడియో–వీడియో విజువల్‌తో కూడిన రాజకీయ ప్రకటనలను ఎంసీఎంసీ నుంచి అనుమతి పొందాకే ప్రచురించాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక నిఘా ఉంటుందని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించి పెట్టే పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇందులో ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీపీఆర్వో తిరుమల తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

కైలాస్‌నగర్: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా దివ్యాంగ నిరుద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈమేరకు కలెక్టర్ రాజర్షి షాను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పెళ్లితో సంబంధం లేకుండా దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు అందించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల్లో 5శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. చేయూత పెన్షన్ రూ.4వేల నుంచి రూ.6వేలకు పెంచాలని కోరారు. దివ్యాంగ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీతో పాటు ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘ బాధ్యులు అబ్దుల్ సలీం, సురేష్, ఎస్.సుకుమార్, రాజశేఖర్ తదితరులున్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న పుల్లయ్య తదితరులు

తలమడుగు: మండలంలోని పలు గ్రామాల్లో వడగళ్లతో దెబ్బతిన్న పంట చేలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య మంగళవారం పరిశీలించారు. పల్లి (బి), పల్లి (కే), నందిగామ, బరంపూర్ గ్రామాల్లో అకాల వర్షానికి నెలకొరిగిన జొన్న, పొగాకు, మొక్కజొన్న పంటలను పరిశీలించి బాధిత రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే చేపట్టి పరిహారం అందేలా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. మండలంలో సుమారు 1200 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి, ఏవో మహేందర్ ఉన్నారు. బాధిత రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కలెక్టర్ రాజర్షి షాను జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి మంగళవారం కలిసి విన్నవించారు. ఆయన వెంట ఎంపీపీ లక్ష్మి రాజేశ్వర్, రైతులు విశల్, గంగన్న, లింగారెడ్డి, సంజీవ్ తదితరులున్నారు.

'కాంగి'రేస్‌లోకి..



సీఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతోపాటు పార్టీ ఆశావహ అభ్యర్థులు సుగుణ, భాస్కర్, దౌలత్‌రావు

- ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా తెరపైకి ముగ్గురు
- సీఈసీ పరిశీలనలో సుగుణ, భాస్కర్, దౌలత్‌రావు
- 'హస్తం' పార్టీలో మారుతున్న సమీకరణాలు

సాక్షి,ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఎంపీ స్థానానికి బీజేపీ, బీఆర్ఎస్‌లు ఇప్పటికే తమ పార్టీ అభ్యర్థులను ప్రకటించాయి. కాంగ్రెస్ మాత్రం ఇంకా తేల్చలేదు. హస్తం పార్టీ ఎవరిని బరిలోకి నిలుపుతుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ పార్టీ నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఆత్రం సుగుణ, ఐటీడీఏ ఏపీవో ఆత్రం భాస్కర్ పేర్లు తెరపైకి వస్తున్నాయి. రాష్ట్రం నుంచి మరో నాయకుడు కోవ దౌలత్‌రావు మొకాశి కలిపి మొత్తంగా మూడు పేర్లు సీఈసీకి వెళ్లినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రధానంగా 'ఆత్రం' నేతల్లోనే పోటీ ఉందని చెప్పుకుంటున్నారు. నేడో, రేపో అభ్యర్థుల జాబితా విడుదల కావచ్చని తెలుస్తోంది.

మారుతున్న సమీకరణాలు..

కాంగ్రెస్ అభ్యర్థి విషయంలో మొదటి నుంచి పలువురు నేతల పేర్లు చర్చలోకి వచ్చాయి. ఆ తర్వాత మారిన సమీకరణాల నేపథ్యంలో చివరిగా ఈ నేతల పేర్లు నిలిచాయి. సీఈసీ ప్రకటనలో ఇంకా ఏమైన మార్పు ఉంటుందా అనేది కూడా పార్టీలో చర్చ సాగుతోంది. కాగా పార్టీలో ఏఐసీసీ సభ్యుడు నరేశ్ జాదవ్‌కే టికెట్ అని మొదట కొద్ది రోజులు ప్రచారం సాగింది. ఆతర్వాత ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్‌ను బరిలోకి దించుతారని చర్చ మొదలైంది. వీరితో పాటు బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, యువజన కాంగ్రెస్ మాజీ నాయకుడు శ్రావణ్ నాయక్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, తదితరుల పేర్లు కూడా చర్చలోకి వచ్చాయి. ఆ తర్వాత ఆదివాసీ అభ్యర్థిని బరిలోకి దించాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జునే పార్టీ అధిష్టానం బరిలోకి దించుతుందని కొద్ది రోజుల పాటు ప్రచారం సాగింది. ఆతర్వాత రిమ్స్ వైద్యురాలు సుమలత సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో సుమలతకు టికెట్ ఇస్తారా అనే ప్రచారం కూడా సాగింది. ఈ పరిణామాల నేపథ్యంలో మొదటి నుంచి టికెట్‌కు యత్నిస్తున్న ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన ఉపాధ్యాయురాలు ఆత్రం సుగుణ, ఐటీడీఏ ఏపీవో ఆత్రం భాస్కర్, కాంగ్రెస్‌లో ఇటీవలే చేరిన దౌలత్‌రావుల పేర్లను సీరియస్‌గా పరిశీలిస్తున్నారన్న చర్చ మొదలైంది. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుతో కలిసి సోమవారం హైదరాబాద్‌లో సీఎం సలహాదారు వేంనరేందర్ రెడ్డిని ఈ ముగ్గురు నేతలు కలిశారు. ఆ తర్వాత ఈ జాబితా ఢిల్లీకి చేరినట్లు చెప్పుకుంటున్నారు. ఈ ముగ్గురిలో సుగుణ, భాస్కర్‌లలో ఎవరికైనా లభించవచ్చని చెప్పుకుంటున్నారు.

విస్తృత ప్రయత్నాలు..

సుగుణ ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.ఆదివాసీ మహిళా ఆర్గనైజేషన్‌కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఇదివరకు ఎంపీటీసీగా వ్యవహరించిన రాజకీయ అనుభవం కూడా ఉంది. కాగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సుగుణకు మద్దతు ఇస్తున్నారని పార్టీలో ప్రచారం ఉంది. ఆత్రం భాస్కర్ ఐటీడీఏ ఏపీవోగా ప్రస్తుతం వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి జిల్లా ఆదివాసీలతో సత్సంబంధాలు ఉన్నాయి. అంతేకాకుండా ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడిగా గతంలో వ్యవహరించారు. ఆ తర్వాత రిసోర్స్ పర్సన్‌గాను పనిచేశారు. అనంతరం గిరిజన సంక్షేమ సహాయ అధికారిగా వ్యవహరించారు. తాజాగా ఏపీవోగా ఇక్కడి గిరిజనులతో సంబంధాలు ఉన్నాయి. జిల్లాలోని ముఖ్య నాయకుల ద్వారా భాస్కర్ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారని చెప్పుకుంటున్నారు. మొత్తంగా ఎవరికి టికెట్ వస్తుందని ప్ర0స్తుతం పార్టీలో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

కేబీఎంకు 'ఎదురు'దెబ్బ!

- గడ్చిరోలి ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి
- మృతుల్లో ఇద్దరు తూర్పు జిల్లా పరిధి కమిటీ వారే..
- పట్టు కోల్పోతున్న కుమురంభీం మంచిర్యాల కమిటీ



తిర్యాణి మండలం గుండాలలో పోలీసుల కూంబింగ్(ఫైల్)







వర్గీశ్(ఫైల్) మృతుల ఫైల్ ఫొటోలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికల ముందు మావోయిస్టు పార్టీ కేబీఎం(కుమురంభీం మంచిర్యాల) కమిటీకి కోలుకోలేని 'ఎదురు'దెబ్బ తగిలింది. మంగళవారం తెల్లవారుజామున మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా అహేరి తాలూకా కొలమార్క కొండలకు ఐదు కిలోమీటర్ల దూరంలో రేపన్‌పల్లి శివారు అడవుల్లో అదనపు ఎస్పీ యతీశ్ దేశ్‌ముఖ్ నేతృత్వంలో సీ60, సీఆర్పీఎఫ్ క్యూఏటీ(క్విక్ యాక్షన్ టీం), మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మంచిర్యాల కుమురంభీం(కేబీఎం) కమిటీ సభ్యుడు, డివిజనల్ కమిటీ మెంబర్(డీవీసీఎం) మంగీ ఇంద్రవెల్లి ఏరియా కమిటీ కార్యదర్శిగా ఉన్న వర్గీశ్ కోయ అలియాస్ మంగులు, డీవీసీఎం, సిర్పూర్–చెన్నూరు ఏరియా కమిటీ కార్యదర్శి మంగ్తూ, ఇద్దరు ప్లాటూన్ సభ్యులు కుర్సాంగ్ రాజు, కుడిమెత వెంకటేశ్ చనిపోయినట్లుగా గుర్తించారు. ఇంకాబలగాల ఆపరేషన్ కొనసాగుతోంది. వీరిపై రూ.36లక్షల రివార్డు ఉంది.

పట్టు కోసం ప్రయత్నాలు..

కేబీఎం కమిటీని బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ కొన్నేళ్లుగా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాడు. ఆ క్రమంలో తొలిసారిగా 2013లో ఇంద్రవెల్లి మండలం వాయిగూడ క్యాంపులో ఉన్నప్పుడు అడెల్లు పోలీసుల కళ్లుగప్పి తృటిలో తప్పించుకున్నాడు. కొన్నాళ్లు దండకారణ్యానికే పరిమితం అయ్యాడు. 2016లో తిర్యాణి మండలం మంగీ దళ కమాండర్ ఆత్రం శోభన్ అలియాస్ చార్లెస్ ఛత్తీసగఢ్‌లో చనిపోవడంతో ఈ దళం క్రమంగా క్రియాశీలతను కోల్పోయింది. కేబీఎంగా రూపాంతరం చెందాక అడెల్లు ప్రాతినిధ్యం వహిస్తూ మరింత పట్టు పెంచుకునే పనిలో పడ్డారు. ఉమ్మడి జిల్లా బోథ్ మండలం పొచ్చెరకు చెందిన అడెల్లుకు ఈ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉంది. పాత పరిచయాలు, సానుభూతిపరులతో 2020లో గిరిజన, ఆదివాసీ యువతను నియామకం చేసుకునేందుకు ప్రయత్నించి వీలుగాక తిరిగి వెళ్లిపోయారు. ఆ ఏడాది జూలైలో మంగీ, గుండాలలో దళ సంచారం ఉందనే సమాచారంలో విస్తృతంగా కూంబింగ్ చేశారు. అదే ఏడాది సెప్టెంబర్‌లో గ్రేహౌండ్స్ బలగాలు కాగజ్‌నగర్ మండలం కదంబా అడవుల్లో జరిపిన కాల్పుల్లో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కేబీఎం కమిటీ యాక్షన్ టీం సభ్యుడు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన చుక్కాలు, మరొకరు చనిపోయారు. 2022 డిసెంబర్‌లో అడెల్లు సహచరి, నిర్మల్ జిల్లా కడెం పెద్దూర్ మండలం లక్ష్మీసాగర్ చెందిన కంతి లింగవ్వ, అలియాస్ అనితా కేబీఎం అసిస్టెంట్ కమాండర్‌గా పని చేస్తుండగా ఛత్తీస్‌గఢ్‌లోని టేకమెట అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయింది. వరుసగా ఘటనలతో పట్టు కోల్పోగా, తాజాగా కమిటీలో కీలక సభ్యులు సైతం మరణించడంతో మరింత బలహీనపడనుంది.

స్థానిక పోలీసుల అప్రమత్తం

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పెన్‌గంగా, ప్రాణహిత, గోదావరి తీరాల్లో అనుమానాస్పద కదలికలపై స్థానిక పోలీసులు నిఘా పెంచారు. డ్రోన్, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ, అంతర్రాష్ట్ర పోలీసుస్టేషన్ల అప్రమత్తం, ఫెర్రి పాయింట్ల భద్రత చేపట్టారు. గతంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై దాడులు చేసే అవకాశం ఉందనే సమాచారంతో అప్రమత్తం కాగా, తాజాగా జరుగుతున్న పరిణామాలతోనూ స్థానిక పోలీసు యంత్రాంగం పోలింగ్ ముగిసి, ఫలితాల వెల్లడి వరకు భద్రతా కట్టుదిట్టం చేసి ప్రత్యేక బలగాలతో తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు.

బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణం

- స్థలాన్ని పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



అక్రమ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్ వాగును ఆనుకుని చేపట్టిన అక్రమ నిర్మాణ స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ మంగళవారం పరిశీలించారు. వాగు బఫర్ జోన్‌ను ఆక్రమించి నిర్మాణం చేపట్టినట్లు కమిషనర్‌కు ఫిర్యాదు అందింది. స్పందించిన ఆయన పట్టణ ప్రణాళిక విభాగం అధికారి అనురాధతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఫిర్యాదుదారుడిని పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బఫర్ జోన్‌తో పాటు 20 అడుగుల రోడ్డును సైతం కబ్జాచేసి అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్లుగా ఫిర్యాదుదారు పేర్కొన్నాడు. అదే సమయంలో అక్కడకు వచ్చిన ఓ వ్యక్తి ఆ స్థలం తనదేనని కమిషనర్‌కు తెలిపాడు. సంబంధిత పత్రాలు చూపించాలని కమిషనర్ కోరగా ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయాడు. స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్స్‌ను రెండు రోజుల్లోగా నిర్మాణదారు తీసుకురావాలని, లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ వెల్లడించారు. కాగా, సాయంత్రం వరకు కూడా ఎవరు ల్యాండ్ పత్రాలతో మున్సిపల్ అధికారుల వద్దకు రాకపోవడం గమనార్హం.

'కోడ్' పక్కాగా అమలు చేయాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

- జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా

కైలాస్‌నగర్: ఎన్నికల ప్రవర్తన నియమావళి (కోడ్)ని పక్కాగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్లలో సి–విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని కోడ్ ఉల్లంఘనలను వీడియోలతో సహా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు అందిన వంద నిమిషాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తాయన్నారు. 1950 టోల్ ఫ్రీనంబర్‌కు సైతం ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కోడ్ ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ట్రెయినీ కలెక్టర్‌వికాస్ మహతో, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెక్టోరల్, సహాయ రిటర్నింగ్ అధికారులకు పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై మంగళవారం ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ఈవీఎంలు, పోలింగ్ కేంద్రాలు వంటి అంశాలపై క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. అంతకు ముందు మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్ సెక్టోరల్ అధికారుల విధులపై శిక్షణ ఇచ్చారు. ఇందులో ఎస్పీ గౌస్ ఆలం, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'పది' పరీక్షలు

- బజార్‌హత్నూర్‌లో పరీక్ష కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్

బజార్‌హత్నూర్: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులు భయం లేకుండా పరీక్షలు రాయాలన్నారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. డెలివరీకి వచ్చే గర్భిణుల కోసం ఏర్పాటు చేసిన వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు చేయించుకున్న కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడారు. ఆయన వెంట డీఈవో ప్రణీత, తహసీల్దార్ శంకర్, ఎంపీడీవో శ్రీనివాస్, సీఎస్ చందన్, ఎస్సై బి.నరేష్, ఎంపీవో అతుల్, వైద్యాధికారులు భీంరావ్, శిల్ప, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

మడిగెల.. మర్మమేంటో!?



ఇక్కడ కనిపిస్తున్న దుకాణాలు ఆదిలాబాద్ పట్టణం శివాజీచౌక్‌లోని మున్సిపల్ కార్యాలయ వ్యాపార సముదాయంలోనివి. 14 దుకాణాల అద్దె కాల పరిమితి ముగిసింది. బహిరంగ వేలం ద్వారా తిరిగి అద్దెకు ఇచ్చేందుకు గత నెల 24న నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశ ఎజెండాలో చేర్చారు. వీటితో పాటు ఓల్డ్ బస్టాండ్ సమీపంలోని 8వ నంబర్ షాపు, మున్సిపల్ కార్యాలయం కింద గల 1,4,36 నంబర్ షాపులను కలిపి మొత్తం 18 దుకాణాలకు వేలం వేయాలని ప్రతిపాదించగా కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.



ఇక్కడ మూసి ఉండి కనిపిస్తున్న దుకాణాలు ఆదిలాబాద్ మున్సిపల్ పాత కార్యాలయ భవనం కింద గల వ్యాపార సముదాయంలోనివి. 19 నుంచి 23వ నంబర్ గల ఐదు మడిగెలను గతంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌కు లీజుకిచ్చారు. వీటి ద్వారా బల్దియాకు నెలకు రూ.48,887 అద్దె సమకూరేది. అయితే రెండేళ్ల క్రితం బ్యాంకును అక్కడినుంచి వేరే చోటికి మార్చారు. వెంటనే ఆ షాపులను అద్దెకు ఇవ్వాల్సిన బల్దియా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఫలితంగా రెండేళ్లలో రూ.11,73,288 ఆదాయం కోల్పోవాల్సి రావడం గమనార్హం.

- రెండేళ్లుగా ఐదు దుకాణాల వేలం పెండింగ్
- రూ.లక్షల్లో ఆదాయం కోల్పోతున్న బల్దియా
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని వ్యాపార సముదాయ మడిగెల అద్దె కేటాయింపులో రాజకీయ జోక్యం మితిమీరుతోంది. దుకాణాల కేటాయింపు నుంచి అద్దెల వసూళ్ల వరకు వారి పెత్తనమే కనిపిస్తోంది. తమకు అనుకూలమైన ఒకరిద్దరికి లబ్ధి చేకూర్చేందుకు రెండేళ్లుగా ఐదు మడిగెలకు బహిరంగ వేలం నిర్వహించడం లేదు. ఫలితంగా బల్దియా ఆదాయానికి గండి పడుతుంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రావిమర్శలువ్యక్తమవుతున్నాయి.

లక్షల ఆదాయం కోల్పోతున్నా..

అదనపు ఆదాయం సమకూర్చుకోవాలనే ఉద్దేశంతో నిర్మించిన మున్సిపల్ పాత కార్యాలయ భవనం కింద గల ఐదు మడిగెలకు రెండేళ్లుగా బహిరంగ వేలం నిర్వహించడం లేదు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఖాళీ చేసినప్పటి నుంచి ఆ మడిగెలు ఖాళీగానే ఉంటున్నాయి. అయితే వేలం జరుగకుండా మున్సిపల్ పరిధిలోని ఓ ద్వితీయస్థాయి నాయకుడు అధికారులపై ఒత్తిడి తెచ్చి అడ్డుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. మూసిఉంచిన మడిగెల వద్ద పండ్ల వ్యాపారాలు చేసుకుంటున్న వారికి ప్రయోజనం కల్పించాలనే ఉద్దేశంతోనే ఈవేలం ప్రక్రియను అడ్డుకుంటున్నట్లుగా చర్చ సాగుతుంది. ఓ వైపు డబ్బుల్లేక కార్మికులకు జీతాలు ఇవ్వలేకపోతున్నామని చెప్పే బల్దియా అధికారులు మరోవైపు వచ్చే ఆదాయాన్ని విస్మరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎమ్మెల్యే ఆదేశాలు సైతం బేఖాతర్

ఆదిలాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత శంకర్ మున్సిపల్ అధికారులతో నిర్వహించిన తొలి సమావేశంలో మడిగెలను వేలం పెండింగ్‌లో ఉంచడాన్ని ప్రస్తావించారు. తక్షణమే బహిరంగ వేలం నిర్వహించి అర్హులకు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. దాదాపు మూడు నెలలవుతున్నా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

ఆ విషయం నా దృష్టికి రాలేదు

మూసి ఉంచిన మడిగెలకు సంబంధించి మా సిబ్బందిని ప్రశ్నించగా కొంత మంది వాటి కేటాయింపునకు వేలం జరిగినట్లు చెబుతుండగా, ఇంకొందరు జరుగలేదని చెబుతున్నారు. ఇప్పటి వరకైతే సంబంధిత ఫైలు నా దృష్టికి రాలేదు. పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటా.

– ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

బాసర అమ్మవారి ఒడి బియ్యం లెక్కింపు


ఒడి బియ్యం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో మంగళవారం ఒడిబియ్యం హుండీలను తెరిచారు. ఇందులో 51.30 క్వింటాళ్ల ఒడి బియ్యం, 230 కిలోల ఎండుకొబ్బరి, 16 కిలోల బరడిపోకలు, 40 కిలోల పసుపు కొమ్ములు, 10 కిలోల బాదం, 32 కిలోల కర్జూర పండ్లు భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. ఒడి బియ్యం ద్వారా రూ.69,242 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విజయరామారావు తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ సిబ్బంది, వాగ్దేవి సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంపాక్ట్ ఉత్తమ ట్రైనర్‌గా చౌహాన్ కృష్ణ


ఉత్తమ మోటివేషనల్ ట్రైనర్ సర్టిఫికెట్ అందుకుంటున్న చౌహాన్ కృష్ణ

భైంసాటౌన్/నార్నూర్ : నార్నూర్ మండలంలోని మహాగావ్ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ చౌహాన్ కృష్ణ ఉత్తమ మోటివేషనల్ ట్రైనర్ సర్టిఫికెట్ పొందారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని హోటల్ మినర్వాగ్రాండ్‌లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు గంప నాగేశ్వరరావు, సినీ నటుడు ప్రదీప్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాధవి చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు. సామాజిక సేవను గుర్తించి తనకు సర్టిఫికెట్ అందించినట్లు చౌహాన్ కృష్ణ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఒకరిపై కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కోలిపూరకు చెందిన మునీర్ బేగ్‌పై సోమవారం రాత్రి 11 గంటలకు కేఆర్‌కే కాలనీకి చెందిన షేక్ షబాద్, సయ్యద్ రేహన్ హస్మీ కత్తితో దాడికి పాల్పడ్డారు. బాధితుడి తల్లి గులాబ్‌బీ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై కేసు

నిర్మల్: సారంగాపూర్ మండలం కుప్టిలో గుడుంబా విక్రయిస్తున్న మహిళపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు పోలీసులు కుప్టి గ్రామ సమీపంలో గాలిస్తుండగా ఓ మహిళ గుడుంబా క్యాన్‌తో వెళ్తున్నట్లు గమనించి తనిఖీ చేయగా ఆమె వద్ద 8 లీటర్ల గుడుంబా దొరికినట్లు తెలిపారు. సదరు గుడుంబాను స్వాధీనం చేసుకుని మహిళపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇకమీదట ఎవరైనా గుడుంబా తయారు చేసినా విక్రయించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కుడుక అను'బంధం'


కిరాణం షాపులో కుడుకలు కొనుగోలు చేస్తున్న ఆదివాసీ గిరిజనులు

- హోలీకి సిద్ధమవుతున్న ఆదివాసీ గూడేలు
- ఎక్కడున్నా పండక్కి ఊరికి రావాల్సిందే
- వేడుకలకు సిద్ధమవుతున్న గిరిజనులు
- కుడుక ఇచ్చిన కుటుంబాలే లెక్కలోకి..


చక్కెర బిళ్లలు కొనుగోలు చేస్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆదివాసీ గ్రామాల్లో హోలీ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గ్రామాల్లో హోలీ(దురాడి)పండుగ అత్యంత పవిత్రంగా... భిన్నంగా నిర్వహిస్తారు. గ్రామస్తులు ఊళ్లో ఉండాలంటే కాముడి దహనం రోజు గ్రామ పెద్దలకు కుడుక ఇవ్వాల్సిందే. అలా ఇస్తేనే ఆ కుటుంబం గ్రామ జాబితాలో ఉంటుంది. కుడుక ఇవ్వనివారితో గ్రామస్తులకు ఎలాంటి సంబంధం ఉండదు. ఆ ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా ఊళ్లో వాళ్లు వెళ్లరు. అందుకే బతుకుదెరువు కోసం వేరే ప్రాంతానికి వెళినా ఉద్యోగ, రాజకీయ రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారుకూడా హోలీకి తప్పకుండా స్వగ్రామానికి వస్తారు. తరాలుగా వస్తున్న ఆచారాన్ని ఆదివాసీలు నేటికీ పాటిస్తున్నారు.

దురాడీ కొబ్రేతో కుటుంబాల లెక్క

కుడుకను ఆదివాసీల భాషలో దురాడీ కొబ్రే (హోలీ కుడక) అని పిలుస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ గ్రామాల్లో ఈ పండుగ ఘనంగా నిర్వహిస్తారు. హోలీకి ఒకరోజు ముందు గ్రామ పెద్ద పటేల్ ఇంట్లో కూర్చొని తమ గ్రామంలో ఎన్ని కొత్త కుటుంబాలు చేరాయి. ఎన్ని కుటుంబాలు ఊరు వదిలి వెళ్లాయనేది కాముడి దహనం రోజు గ్రామస్తులు ఇచ్చిన కుడుకల ఆధారంగా లెక్కచూస్తారు. కొత్తగా కాపురాలు పెట్టిన వారుకూడా ఈ రోజే గ్రామ జాబితాలో చేరడానికి అవకాశం ఉంటుంది.

బూడిదకు అత్యంత ప్రాధాన్యం

ఆదివాసీ సంప్రదాయం ప్రకారం కాముడి దహనం చేసిన బూడిదను ఇండ్ల ముఖద్వారాల వద్ద గీతగా వేస్తారు. ఇలా వేస్తే ఎలాంటి దుష్టశక్తులు ఇంట్లోకి రావని ఆదివాసీల నమ్మకం. అంతేకాకుండా ఆదివాసీ గ్రామాల్లో అతి పవిత్రంగా నిర్వహించే దండారీ ఉత్సవాల్లో కాముడి దహనం బూడిదకు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. గుస్సాడీల వేషధారణకు ఈ బూడిదనే ఉపయోగిస్తారు.

కాముడి దహనం...

హోలీకి ఒకరోజు ముందు కుడుకలు సేకరించిన అనంతరం అటవీప్రాంతం నుంచి మాతారి, మాత్రాల్ (వృద్ధురాలు..వృద్ధుడు) పేర్లతో తీసుకొచ్చిన రెండు వెదురు బొంగులకు ఇళ్ల నుంచి సేకరించిన కుడుక ముక్కలు, చక్కెర బిళ్లల హారాలు, ఉల్లిమొక్కలు, నైవేద్యం, మోదుగపూలతో పేర్చి గ్రామ పొలిమేరలో సంప్రదాయ వాయిద్యాల మధ్య కాముడిదహనం చేస్తారు. ఆ స్థలంలో రాత్రంతా జాగారం ఉంటారు. జాజిరిరూపంలో ఇళ్ల నుంచి సేకరించిన నవధాన్యాలతో గుడాలు వండడంతో పాటు ఆ రోజు దొంగిలించి తెచ్చిన కోళ్లు, మేకపోతులను ఆస్థలంలో బలిస్తారు. ఇది అనాదిగా వస్తున్న ఆచారం. మరుసటి రోజు బావ బావమరుదులు, చిన్నాపెద్ద తేడాలేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉల్లాసంగా గడుపుతారు. సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ నృత్యం చేస్తారు.

పకడ్బందీగా కుడుక సేకరణ



ఆదివాసీ గ్రామాల్లో హోలి ఘనంగా నిర్వహిస్తాం. కాముడి దహనం రోజు గ్రామ పెద్ద ఇంట్లో పెద్దల సమక్షంలో కుడుక సేకరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తాం. సేకరించిన కుడుకల ఆధారంగా గ్రామంలో నివాసం ఉంటున్న కుటుంబాల లెక్క చూస్తాం. ఈ ఆచార వ్యవహారాలను పాటిస్తూ భావితరాలకు అందిస్తున్నాం.

– వెట్టి రాజేశ్వర్, పిట్టబొంగరం గ్రామ పటేల్

అకాల వర్షం.. తడిసిన ధాన్యం..


తడిసిన మొక్కజొన్న పంటను చూపిస్తున్న రైతు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని మర్కగూడ, అందునాయక్‌తండా, హీరాపూర్, ఏమాయికుంట, సమాక, సట్వాజిగూడ, చింతకర, కేస్లాగూడ, ముత్నూర్, తుమ్మగూడ, తదితర గ్రామాల్లో మంగళవారం అకాల వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి చేతికి అందివచ్చిన మొక్కజొన్న, జొన్న, గోధుమపంటలు నేల కొరిగాయి. ఆరబెట్టిన మొక్కజొన్న కుప్పల్లోకి నీరు చేరడంతో మక్కలు తడిసిపోయాయి. తీవ్ర నష్టం జరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉత్తమ షార్ట్‌ఫిల్మ్‌గా 'శ్రీకారం'

- ఉత్తమ దర్శకురాలిగా మేరీమాత


పురస్కారం అందుకుంటున్న మేరీమాత

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రానికి చెందిన రచయిత, దర్శకురాలు చిత్తూరు మేరీమాత దర్శకత్వంలో నిర్మించిన షార్ట్ ఫిల్మ్ 'శ్రీకారం' రాష్ట్రస్థాయి ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఐద్వా సంస్థ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన షార్ట్ ఫిలిం ఎంపిక పోటీల్లో 'శ్రీకారం' షార్ట్ ఫిలిం ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఈ చిత్రాన్ని రావుల శామ్యూల్ నిర్మించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ షార్ట్ ఫిలిం దర్శకురాలిగా మేరీమాత పురస్కారం అందుకున్నారు. ప్రస్తుత సమాజంలో ట్రాన్స్‌జెండర్స్‌పై వివక్ష, జీవనోపాధి కోసం వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇందులో రూపొందించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చలనచిత్ర టీవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడిచెర్ల రాజు, కెమెరామెన్ కృష్ణవర్మ, పడాల మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన చేపల వేట

- వలలో చిక్కుకుని మత్స్యకారుడు మృతి


రాజన్న మృతదేహం

మామడ: చేపల వలలో చిక్కుకుని మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన మత్స్యకారుడు చెరుకు రాజన్న(46)మంగళవారం గ్రామ సమీపంలోని యెంగన్న చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు కాళ్లకు వల చుట్టుకోవడంతో నీటిలో మునిగాడు. సమీపంలో ఉన్న జాలరులు గమనించి బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.


అక్రమ లే అవుట్లపై బల్దియా అధికారుల కొరడా


లేఅవుట్‌లో రాళ్లను తొలగిస్తున్న దృశ్యం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసిన లేఅవుట్లపై బల్దియా అధికారులు కొరడా ఝులిపించారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారి అనురాధ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ పరిధిలోని అనుకుంట, బంగారుగూడ, ఖానాపూర్, అంకోలి సమీపంలోని వివిధ సర్వే నెంబర్లలో గల అక్రమ లేఅవుట్లను బల్దియా సిబ్బంది పరిశీలించారు. వాటికి అధికారిక అనుమతులు లేకపోవడంతో వాటిల్లో ప్లాట్లుగా విభజిస్తు పాతిన బండరాళ్లను జేసీబీతో తొలగించారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసే లేఅవుట్లలోని ప్లాట్లను ప్రజలు కొనుగోలు చేయవద్దని ఈ సందర్భంగా టీపీవో సూచించారు. భవిష్యత్‌లో అనుమతుల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.

చోరీ సొత్తు స్వాధీనం

- నిందితురాలి రిమాండ్


రికవరీ చేసిన బంగారం, నగదు

జైనథ్: మండలంలోని మాకోడ గ్రామానికి చెందిన నిమ్మల రవికాంత్‌రెడ్డి నివాసంలో ఈ నెల 11న చోరీకి గురైన 4 తులాల బంగారం, రూ.40వేల నగదును రికవరీ చేసినట్లు జైనథ్ సీఐ డి.సాయినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. అదే గ్రామానికి చెందిన లక్ష్మీ అనే మహిళ రవికాంత్ ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి దొంగతనానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మాకోడ గ్రామ బస్టాండ్ వద్ద నిందితురాలి నుంచి బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నారు. మహిళను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించారు. కాగా అత్యాశతోనే చోరీకి పాల్పడిందని సీఐ తెలిపారు. వారం రోజుల్లోనే కేసును ఛేదించిన సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం, కానిస్టేబుళ్లు శివాజీ, రాజు, స్వామిని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అభినందించారు.


జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంప్ ఆఫీస్ ఎదుట మట్టికుండలు కొనుగోలు చేస్తున్న మహిళలు


మట్టితో తయారు చేసిన వాటర్ బాటిళ్లు

మట్టి కుండ.. మస్తు సల్లగ..



వేసవికాలంలో మట్టికుండలోని నీళ్లు తాగితే చల్లదనంతో పాటు ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుంది. అందుకే ఎన్ని ఫ్రిజ్‌లు వచ్చినా రంజన్లకు డిమాండ్ తగ్గడంలేదు. ప్రస్తుతం ఎండలు ముదరడంతో మట్టికుండలు, రంజన్లకు గిరాకీ పెరిగింది. రాజస్థాన్ నుంచి తెప్పించిన రంజన్లను జిల్లా కేంద్రంలోని, ఎస్పీ క్యాంప్ కార్యాలయం పక్కన, శివాజీ చౌక్ ప్రాంతంలో, పలుచోట్ల విక్రయిస్తున్నారు. వివిధ ఆకృతుల్లో తయారుచేసిన మట్టి కుండలు, వాటర్ బాటిళ్లు, కుజాలు ఆకట్టుకుంటున్నాయి. ఒక్కో రంజన్‌కు రూ.200 నుండి రూ.500వరకు, వాటర్ బాటిల్‌కు రూ.100 నుంచి రూ.300 వరకు అమ్ముతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్


రాజస్థానీ నల్లరంగు కుండలు

సేవాలాల్‌ను దర్శించుకున్న ఎమ్మెల్యే


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: మండలంలోని ఆరెపల్లి (లింగట్ల) గ్రామంలోని శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జగదాంబ దేవిని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నాని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను శాలువతో ఘనంగా సన్మానించారు.

మట్కా నిందితుల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: ఇద్దరు మట్కా జూదరులను మంగళవారం అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. పట్టణంలోని ఖుర్షిద్‌నగర్ ప్రాంతంలో మట్కా నిర్వహిస్తున్నారనే పక్కా సమాచారంతో సీసీఎస్ పోలీసులతో పాటు టు టౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. సుందరయ్యనగర్‌కు చెందిన అబ్దుల్ సలాం, ఎస్‌కే అహ్మద్ మట్కా ఆడుతుండగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,330 నగదుతో పాటు మట్కా చిట్టీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఎక్కడైనా మట్కా ఆడుతున్నట్లు తెలిస్తే సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పి.చంద్రశేఖర్ (8712659965)కు సమాచారం అందించాలని సూచించారు.

'గురుకులం'లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్సీవో గోపీచంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 12లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి 28న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నిర్మల్ జిల్లాలో బాలురు బీఎస్సీ (ఎంపీసీ), (ఎంపీసీఎస్), (ఎంఎస్‌సీఎస్), (బీజెడ్‌సీ), (ఎంబీజెడ్‌సీ), బీకాం (ఏ), (బీఏ), బీఏ (హెచ్‌పీఎస్), మంచిర్యాల జిల్లాలో బాలురు బీఎస్సీ (ఎంపీజీ), (ఎంపీసీఎస్), (ఎంఎస్‌సీఎస్), (ఎంఎస్‌డీఎస్), (బీజెడ్‌సీ), బీకాం (ఏ), (బీఏ), (ఈపీఎస్‌పీఏ), కుమురంభీంజిల్లాలో బాలికలు బీఎస్సీ (ఎంపీసీ), (ఎంపీసీఎస్), (ఎంఎస్‌సీఎస్), (ఎంఎస్‌డీఎస్), (బీజెడ్‌సీ), బీకాం (ఏ), బీకాం (జీ), బీఏ (ఈపీహెచ్), ఆదిలాబాద్ జిల్లాలో బాలికలు బీఎస్సీ (ఎంపీసీ), (ఎంఎస్‌సీఎస్), (ఎంఎస్‌డీఎస్), (బీజెడ్‌సీ), బీకాం (జీ), (ఏ), బీఏ (ఈపీహెచ్) కోర్సుల్లో ప్రవేశాలు ఉంటాయన్నారు. ప్రతీ కోర్సుకు 40 చొప్పున సీట్లు ఉంటాయని, ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వాతావరణం కూల్ కూల్







కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచే ఆకాశం మేఘావృత్తమై ఉండగా మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో వర్షం పడింది. చిరు జల్లులతో మొదలై మోస్తరుగా గంటన్నర పాటు ఏకధాటిగా కురిసింది. దీంతో ఆదిలాబాద్ పట్టణం తడిసి ముద్దయింది. వాహనదారులు, వీధి వ్యాపారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఎండల వేడితో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు చల్లబడిన వాతావరణంతో కొంత ఊరట లభించింది.

పంతుళ్ల కోసం విద్యార్థుల పడిగాపులు

పలువురికి ఆదర్శంగా నిలవాల్సిన కొంతమంది గురువులు సమయపాలన పాటించకుండా వారికి నచ్చినప్పుడే బడిబాట పడుతున్నారు. ప్రస్తుతం వేసవి ఎండల తీవ్రత కారణంగా ప్రభుత్వం ఒంటిపూట బడులు నిర్వహిస్తోంది. ఉదయం 8 గంటలకే తరగతులు ప్రారంభం కావాల్సి ఉండగా 8:15 గంటల వరకు ఉపాధ్యాయులు రాకపోవడంతో తలమడుగు మండలం సాయిలింగి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గేట్ తాళం తీయలేదు. ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యార్థులు గేటు వద్దే నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



క్లుప్తంగా

రెండోరోజు ప్రశాంతంగా 'పది' పరీక్షలు

ఇచ్చోడ: మండల కేంద్రంలో మంగళవారం రెండో రోజు జరిగిన పది పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మూడు పరీక్ష కేంద్రాల్లో 977 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 973 మంది హాజరుకాగా నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాధికారి రాథోడ్ ఉదయ్‌రావు తెలిపారు.

గాలికుంటు నివారణకు టీకాలు



టీకా వేస్తున్న పశువైద్యాధికారి గోవింద్‌నాయక్

ఇచ్చోడ: గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి గోవింద్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని కోకస్‌మన్నూర్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రతీ సంత్సవరం వేసవిలో పశువులకు ముందస్తుగా గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు అందిస్తున్నట్లు తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



సహాయం అందిస్తున్న మిత్రులు

ఉట్నూర్‌రూరల్: తోటి స్నేహితుడు హఠాన్మరణం బాధాకరమని మృతుడి స్నేహితులు వాపోయారు.. మండలంలోని సాలెవాడ రామానికి చెందిన వెట్టి సూరజ్ ఇటీవల మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో పదో తరగతి స్నేహితులంతా కలిసి రూ.12500 కుటుంబ సభ్యులకు అందచేశారు. కార్యక్రమంలో ధరంసింగ్, నందకుమార్, చరణ్, నవీన్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: మండలంలోని చిన్న బుగ్గారాం గ్రామానికి చెందిన పవార్ రాయులు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతికి గల కారణాలను ఆ కుటుంబ సభ్యుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ రాథోడ్ సజన్, నేరడిగొండ పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్‌సింగ్, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

ప్రో క్రికెట్ పోటీలకు ఎంపిక



సూర్యచంద్ర తేజస్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన సూర్య చంద్ర తేజస్ ప్రో క్రికెట్ చాంపియన్‌షిప్ ట్రోఫీకి ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన ప్రో క్రికెట్ చాంపియన్‌షిప్ సెలక్షన్ పోటీల్లో ఆల్ రౌండర్‌గా సత్తా చాటి అండర్- 14 విభాగంలో ఎంపికయ్యాడు. ఈ నెల 24వ తేదీన ఢిల్లీలో జరిగే తెలంగాణ అండర్ 14 జట్టుకు తేజస్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. తేజస్ జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్నాడు. పోటీలకు ఎంపిక కావడంపై కోచ్ జయేంద్ర పటాస్కర్ అభినందనలు తెలిపారు.

సీఎంను కలిసిన శ్రావణ్‌నాయక్



కైలాస్‌నగర్: జిల్లాకు చెందిన యువజన కాంగ్రెస్ మాజీ నాయకుడు శ్రవణ్ నాయక్ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా ఢిల్లీలో కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. బంజార వర్గానికి చెందిన తనకు ఎంపీ టికెట్‌ను కేటాయించాలని కోరాడు.

అటకెక్కిన ఆట సామగ్రి

- పర్యవేక్షణ లేక మూలనపడిన వైనం
- లక్ష్యానికి దూరంగా క్రీడా ప్రాంగణాలు
- చాలా చోట్ల ఇదే పరిస్థితి..



గ్రామ పంచాయతీ కార్యాలయం

నార్నూర్: గ్రామీణ ప్రాంత యువతి యువకుల్లో క్రీడలపై మక్కువ పెంచేందుకు, ఆసక్తి గల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం 2022లో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఉద్దేశం మంచిదే అయినా కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రాధాన్యతను విస్మరించడంతో లక్ష్యానికి ఆ వేదికలు దూరంగా ఉన్నాయి. మరోవైపు ఆటల కోసం రూ. లక్షలు వెచ్చించి తెచ్చిన కిట్లు పంచాయతీ కార్యాలయాల్లోనే మూలనపడ్డాయి. కొన్నిచోట్ల అవి పక్కదారి పట్టాయి. లక్ష్యాన్ని పూర్తి చేయాలనే ఉద్దేశంతో ఉభయ జిల్లాల్లో చాలావరకు క్రీడలకు అణువు గాని చోట అంటే వైకుంఠధామాలు, చెరువులు, పంట పొలాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. సింగిల్, డబుల్ బార్లు వేసి క్రీడా ప్రాంగణం బోర్డు ఉంచి చేతులు దులుపుకున్నారు. ఇంకో పక్కన అణువు గానిచోట వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, లాంగ్ జంప్ లాంటి ఆటలు ఆడేందుకు విలువైన క్రీడా పరికరాలను గత ప్రభుత్వం పంపిణీ చేసింది. తెలంగాణ క్రీడ సంస్థ ఆధ్వర్యంలో గత ప్రభుత్వం అన్ని రకాల కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లకు రూ. 1.12 కోట్లు వెచ్చించింది. నార్నూర్ మండలంలో మొత్తం 23, గాదిగూడ మండలంలో మొత్తం 25 గ్రామ పంచాయతీలకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు.

కొరవడిన సమాచారం..

పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో క్రీడా పరికరాలను ఉంచారు. క్రీడ ప్రాంగణం పరిధిలోని యువకులు, కార్యదర్శిని సంప్రదించి వాటిని తీసుకోవాలి. ఆడుకున్న తర్వాత మళ్లీ అప్పగించాల్సి. అయితే క్రీడా పరికరాలు వచ్చాయనే విషయం చాలా చోట్ల స్థానికులకు తెలియదు. చాలామంది పంచాయతీ కార్యదర్శులు సైతం గ్రామాల్లో ఈ విషయమై సమాచారం ఇవ్వలేదు. దీంతో కార్యాలయాల్లోనే సామగ్రి మూలనపడి ఉంది. కొన్నిచోట్ల గత పాలకులు తమకు అనుకూలంగా ఉన్న వారికి వీటిని కట్టబెట్టినట్లు విమర్శలున్నాయి.

కిట్‌లోని సామగ్రి..

ఒక్కో కిట్ విలువ రూ.15వేలు. వీటిలో రెండు క్రికెట్ బ్యాట్లు, రెండు బ్యాటింగ్ గ్లౌజ్‌లు, ఒక వికెట్ కీపింగ్ గ్లౌజ్, ఆరు క్రికెట్ బాల్స్, నాలుగు సింథటిక్ వాలీబాల్స్, రెండు వాలీబాల్స్ నెట్లు, ఒక సైకిల్ పంప్, మూడు డంబెల్స్ (2,5,5,7,5 కిలోలు) రెండు డిస్కస్ త్రోలు (కిలో 2కిలోలు) 6 టెన్నికాయిట్ రింగ్స్, 4 స్కిప్పింగ్ రోప్స్, ఒక స్టాప్ వాచ్, మూడు ప్లాస్టిక్ విజిల్స్, 75 ప్లేయర్స్ టీషర్ట్స్ ఉన్నాయి.

పంచాయతీ పర్యవేక్షణలోనే



పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలోనే క్రీడ పరికరాలు ఉన్నాయి. క్రీడా సామగ్రి పంపిణీ చేసిన ప్రారంభంలో మండలంలోని 23గ్రామ పంచాయతీలకు పంపిణీ చేయడం జరిగింది. ఒకటి రెండు పెద్ద గ్రామపంచాయతీలకు అదనంగా కిట్లు అందజేయడం జరిగింది. క్రీడా సామాగ్రి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇస్తాం.

– జవహర్, ఎంపీడీవో, నార్నూర్

వడగండ్లతో అన్నదాతకు నష్టం



తలమడుగు: పంటలను పరిశీలిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఆదిలాబాద్‌రూరల్: కుంగిన విద్యుత్ స్తంభం



బజార్‌హత్నూర్: గంగాపూర్‌లో నేలకొరిగిన జొన్న

తలమడుగు: వడగళ్ల వర్షానికి నష్టపోయిన రైతులకు ప్రభుత్వమే నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని పల్లి బి, పల్లి కే గ్రామాల్లో పర్యటించి వడగళ్ల వర్షానికి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. నష్టపోయిన రైతులకు తక్షణమే ఎకరానికి 50వేల రూపాయలు ఆర్థిక సాయం అందించాలన్నారు. పంట నష్టాన్ని సర్వే చేపట్టి రైతులకు న్యాయం జరిగే చూడాలని కోరారు. నియోజవర్గంలో అకాల వర్షాలతో నష్టపోయిన గ్రామాల్లో వెంటనే సంబంధిత శాఖ అధికారులు సర్వే చేపట్టాలన్నారు. మండలంలో దాదాపు 1200 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారని, నష్టపోయిన ప్రతి ఒక్క రైతుకు పరిహారం అందించాలన్నారు. రైతులు కేదారేశ్వర్ రెడ్డి. మొట్టె కిరణ్ కుమార్, నాగరెడ్డి, వసంత్ రెడ్డి, మండల కన్వీనర్ తోట వెంకటేష్, రమకాంత్ ఉన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలో మంగళవారం ఈదురుగాలులతో కురిసిన వర్షానికి మొక్కజొన్న, వేరుశనగ, తదితర పంటలు నెలకొరిగాయి. అలాగే విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరగడంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గాలికి చెట్లు రోడ్లపై పడడంతో పలు గ్రామాలకు వెళ్లే ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్‌ను పునరుద్ధరించడానికి ఆ శాఖ అధికారులు మరమ్మతులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. మరి కొన్ని గ్రామాలకు రాత్రి వరకు విద్యుత్ సరఫరా కాలేదు. దీంతో ఆయా గ్రామాలు అంధకారంలో ఉండవాల్సిన పరిస్థితి నెలకొంది.

బజార్‌హత్నూర్: మండల కేంద్రంతో పాటు గిర్నూర్, దేగామ, బోస్రా, గంగాపూర్, దిగ్నూర్, పిప్రి, జాతర్ల, చందునాయక్‌తండా, భూతాయి గ్రామాల్లో జొన్న, మొక్కజొన్న, గోధుమ పంటలు దెబ్బతిన్నాయి. నష్టపరిహారం ఇవ్వాలని రైతులు కోరారు.

తాంసి, భీంపూర్ మండలాల్లో..

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం సమయంలో వర్షం కురిసింది. వారం రోజుల ఎండతీవ్రత పెరిగి ఉక్కపోతతో నుంచి జనానికి మంగళవారం కురిసిన వర్షంతో కొంత ఉపశమనం లభించింది.

మోస్తారు వర్షం..

బోథ్: బోథ్, సొనాల మండలాల్లో మంగళవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. బోథ్, సొనాల, కౌఠ బి, కనుగుట్ట, పొచ్చెర, సాకెర , మర్లపెల్లి గ్రామాల్లో కురిసిన వర్షం రైతులకు ఊరటనిచ్చింది. పంటలు ఎండుతున్న సమయంలో కురిసిన వర్షం పంటలకు జీవం పోసింది.

టీఎస్ఎఫ్ సభ్యులకు సత్కారం



సత్కారం పొందిన నేతలు

ఆదిలాబాద్‌రూరల్: నూతనంగా ఎన్నికై న తెలంగాణ స్టూడెంట్స్ ఫోరం (టీఎస్ఎఫ్) సభ్యులను ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) ఆధ్వర్యంలో శాలువ, పూలమాలతో సత్కరించారు. మంగళవారం మావల మండలంలోని బట్టిసావర్ గాం శివారు ప్రాంతంలోని కుమురంభీం గూడలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శాస్త్రీయ విద్యా విధానం అమలు చేసి కామన్ స్కూల్ విద్యా విధానం కోసం కృషి చేయాలన్నారు. పెండింగ్‌లోని స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. విద్యార్థుల సమస్యలతో పాటు సామాజిక సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిర, రాణి దుర్గ వతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు గోడం జంగు బాయి, సోయం లలితా, టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి రాహుల్, ఉపాధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ఇఫ్తార్, సహాయ కార్యదర్శి సత్యనారాయణ, ఆత్రం గణపతి, వెడ్మా ముకుంద రావు, శాంత బాయి పాల్గొన్నారు.

వ్యాపారి అదృశ్యం..?

బోథ్: మండల కేంద్రంలో గతంలో రైతుల నుంచి పంటలు కొనుగోలు చేసే వ్యాపారి అదృశ్యమైనట్లు తెలుస్తోంది. రైతుల వద్ద వివిధ రకాల పంటలు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వలేదని పలువురు రైతులు సోషల్ మీడియాలో పేర్కొంటున్నారు. గత రెండేళ్ల క్రితం తమ వద్ద పంటలు కొనుగోలు చేసిన సదరు వ్యాపారి తమకు డబ్బులు చెల్లించకుండా అదృశ్యమయ్యాడని రైతులు పేర్కొంటున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఎట్టకేలకు నీటి సరఫరా

బజార్‌హత్నూర్: మండలంలోని హర్కాయి, బీమ్లా నాయక్ తండా గ్రామాలకు రెండు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో రెండు రోజులుగా ప్రజలు ఇబ్బంది పడ్డారు. దీంతో స్పెషల్ ఆఫీసర్ హరిలాల్ చొరువతో గ్రామపంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని అందించారు. మంగళవారం ఇచ్చోడలో మిషన్ భగీరథ పంప్‌హౌస్ మోటర్ రిపేర్ తర్వాత ఎట్టకేలకు గ్రామాలకు భగీరథ నీటి సరఫరా చేశారు.

నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటే భవిష్యత్



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీనివాస్

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదుగాలంటే నైపుణ్యాలను కలిగి ఉండాలని స్థానిక ప్రభుత్వ సైన్సెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.ఏ శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ స్కిల్డ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో టాస్క్ సౌజన్యంతో 21వ శతాబ్దపు బదిలీ చేయగల నైపుణ్యాలపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21వ శతాబ్దంలో విద్యార్థులు జీవితంలో స్థిరపడాలంటే సాఫ్ట్ స్కిల్స్‌లో ప్రావీణ్యత పొందటం ఎంతో ముఖ్యమన్నారు. ఎంతో విలువైన శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డా. ఎం.నర్సింగ రావు, మెంటర్ ఎమ్.డి.ఇమ్రాన్ అలీ, టాస్క్ శిక్షకుడు పి.రామ మనోజ్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



నేరడిగొండ: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రోల్ మామడ టోల్‌ప్లాజా వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఎస్సై శ్రీకాంత్, వ్యవసాయ శాఖ అధికారి బిర్రు భాస్కర్‌లతో పాటు ఎన్నికల అధికారులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాల్లో పెద్ద ఎత్తున నగదు తరలిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైన నగదు తీసుకెళ్లేటప్పుడు వాటికి సంబంధించి రశీదులను చూపించాల్సి ఉంటుందని తెలిపారు.

తాంసి వార్డెన్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

కైలాస్‌నగర్: తాంసి ఆశ్రమ పాఠశాల వార్డెన్ స్వప్న సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కోరారు. మంగళవారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాను కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. వార్డెన్‌కు ఐదు నెలల బాబు ఉన్నారని, మీరు వచ్చే పది నిమిషాల ముందే ఆమె మిల్క్ ఫీడింగ్ ఇవ్వడానికి ఇంటికి వెళ్లిందని తెలిపారు. అందుబాటులో లేరనే కారణంతో సస్పెండ్ చేయడం సరికాదని, ఆమె సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో భాస్కర్, గణేష్, కేశవ్, అరుణ్ తదితరులు ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సంతోష్ రెడ్డి

నేరడిగొండ: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సంతోష్‌రెడ్డి అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనందునా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఓటరు జాబితాలో సవరణను వేగవంతం చేయాలని ఆదేశించారు. కోడ్‌ను ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పెద్ద మొత్తంలో నగదు తరలించరాదని, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయరాదన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మహేష్, ఎంఆర్ఐ నాగోరావు, సీనియర్ అసిస్టెంట్ మీరాబాయి, ఎంసీ శంకర్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్ అందిస్తున్న ఏపీఎం రమేష్

నార్నూర్: మగ్గం వర్క్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళవారం మండల కేంద్రంలోని ఇంద్ర క్రాంతి పథకం (సెర్ప్) కార్యాలయంలో ఏపీఎం మైస రమేష్ ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్ర క్రాంతి పథకం ద్వారా 43 మంది మహిళలకు మగ్గం వర్క్‌పై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణను దిగ్విజయంగా పూర్తిచేసుకున్న మహిళలను అభినందించడంతో పాటు వారిని ప్రోత్సహించడానికి సర్టిఫికెట్లు అందజేస్తున్నామన్నారు. ప్రస్తుత కాలంలో మగ్గం వర్క్ చాలా డిమాండ్ ఉందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు స్వయం ఉపాధి పొంది పొంది కాళ్లపై వాళ్లు నిలబడి కుటుంబానికి ఆసరా కావాలన్నారు. రానున్న రోజుల్లో కుట్టు మిషన్ వచ్చిన వారికి స్కూల్ యూనిఫాం కుట్టుటకు అవకాశం కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో సీసీలు కాంబ్లె సంతోష్, రాథోడ్ సంతోష్, జాదవ్ కిషన్‌రావు ఉన్నారు.

యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న నోడల్ అధికారి సాయన్న

ఆదిలాబాద్‌రూరల్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎస్‌వీఈఈపీ నోడల్ అధికారి సాయన్న అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలురు డిగ్రీ గురుకుల కళాశాలలో ఎస్‌వీఈఈపీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫాం6 నింపి సంబంధిత బూత్ స్థాయి అధికారికి అందించాలన్నారు. అంతేకాకుండా ఆన్‌లైన్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చాని, దీని కోసం ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ మెమో జత చేయాలన్నారు. ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో వారి ఓటును వినియోగించుకోవడంతో పాటు ఇతరులు ఓటు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ రూరల్ తహసీల్దార్ దిలీప్ కుమార్, సాంస్కృతి కళా బృందం సభ్యులు పాల్గొన్నారు.

సిరిచెల్మ జాతరలో బయోమొబైల్ టాయిలెట్



బయో మొబైల్ టాయిలెట్ వాహనం

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ మల్లన్న జాతరలో మంగళవారం బయో మొబైల్ టాయిలెట్‌ను ఏర్పాటు చేశారు. జాతరలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన పంచాయతీ ప్రత్యేక అధికారి డిప్యూటీ తహసీల్దార్ జాదవ్‌రామారావు జిల్లా అధికారులతో మాట్లాడి ఈ వాహనాన్ని జాతరలో ఏర్పాటు చేయించారు. మొదటి సారిగా జాతరలో బయో మొబైల్ టాయిలెట్ ఏర్పాటు చేయడం పట్ల భక్తులు, జాతరకు వచ్చిన భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ ప్రత్యేక అధికారి రామారావు మాట్లాడుతూ.. జాతరకు వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా దీనిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

ఆదిలాబాద్‌టౌన్: చిరుధాన్యాలను ఆహారంలో తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గౌరి రాణి అన్నారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని వరలక్ష్మినగర్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలియజేసేలా ప్లకార్డులను ప్రదర్శిస్తు, బోనాలను ఎత్తుకుని కాలనీలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. చిన్న పిల్లలకు ప్రోటీన్స్, విటమిన్స్, చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కవిత, రాధ, జ్యోతి పాల్గొన్నారు.



మధ్యాహ్నం ఎన్టీఆర్ చౌక్‌లో..

భిన్నమైన వాతావరణం

గత కొన్ని రోజులుగా జిల్లాలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఓ వైపు ఎండలు దంచి కొడుతుండగా మరోవైపు అనూహ్యంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం వర్షం కురవగా సాయంత్రం 5గంటల సమయంలో ఎండకాయడంతో మారిన భిన్న వాతావరణానికి నిదర్శనంగా నిలుస్తోంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



సాయంత్రం సమయంలో..